# మనసులోని ముల్లు



ద్విభాష్యం రాజేశ్వరరావు

అపరాహ్నం దాటి ఝాము పొద్దు వాటారింది!

ఉదయంనుండి దట్టంగా కురిసిన వాన వెలిసింది. ఆకాశంలో చెదురుగా పరుచుకున్న నల్లని మబ్బుల మధ్య నుండి పచ్చని సూర్యకిరణాలు భూమి మీద పరచుకుంటున్నాయి. బంగారు మలామా చేసినట్లు ప్రకృతి తళతళా మెరిసిపోతోంది!

రాఘవయ్యగారు వీధివరండాలోని పడక కుర్చీలో కూర్చున్నారు. చేతి కర్ర వంకీచుట్టూ చేతులు రెండూ బలంగా ముడివేసి దానిమీద చుబుకాన్ని మోపి దీర్ఘంగా వీధి గేటువైపే చూస్తున్నారు. దబ్బపండులాంటి ఆయన ముఖం కోపంతో కందగడ్డలా తయారయింది. నుదుటినుండి జారిన చెమట బిందువు పండిన గుబురు మీసాల సందున నిలబడి చోద్యం చూస్తోంది; ఆయన వక్షం ఆయాసంతో ఎగిరెగిరి పడుతోంది.

“హు!...ఎలాటి పని చేశాడు! పన్నెండేళ్ళు నిండనివెధవ ! ఛీ ! నా కడుపున చెడబుట్టేడు!” అనుకున్నారు కసిగా. ఆ క్షణంలో రాజు తన ఎదుట వుంటే పీకనులిమి చంపేద్దామనుకున్నంతకోపం వచ్చింది.

రాజు తన సంతానంలో మిగిలిన ఒక్కగానొక్క కొడుకు!వాణ్ణి చక్కగా చదివించి, సుగుణాలతో తీర్చిదిద్ది సంఘంలో గొప్ప వ్యక్తిగా తయారు చేయాలని, తను ఎన్ని కలలు కంటున్నాడో! అందుకనుగుణంగానే వాడు పెరుగుతున్నాడని తను ఎంతో ఆశతో జీవిస్తున్నాడు. కాని ఈ దినం జరిగిందేమిటి ?

బాల్యం అనేది లేతమొక్కలాటిది. దానికి ఎంతో విలువయిన సంరక్షణ కావాలి. దానిచుట్టూ శిక్షణ అనే ముళ్ళకంచె పాతాలి! చదువు అనే నీరు పోసి జాగ్రత్తగా పెంచాలి. భవిష్యత్తులో బంగారు పూలు పూయటానికి, రంగారు కలలు పండించుకోటానికి ఈ వేళ కాస్త కఠినంగానయినా ఆ రక్షణ తీసుకోకతప్పదు. కాని రాజు ఈ దినం ఆ పరిధి దాటి అవతలకి వెళ్లటానికి ప్రయత్నించేడు.

రాజుకోసం నిరీక్షిస్తూ తదేకంగా గేటువైపు చూస్తున్నారు రాఘవయ్యగారు. గేటు ప్రక్కనుండి రోడ్డు వైపుకి తొంగిచూస్తున్న పున్నాగచెట్టు నుండి అప్పుడప్పుడు టపటపమనే శబ్దంతో నీటిబిందువులు రాల్తున్నాయి. ఈలపిట్ట మత్తుగా కూని ఆకుల కదలికలకు బెదిరి రెక్కలు విదిలించుకుని ఎక్కడకో పారిపోయింది.

శాంతమ్మగారు లోపలినుండి తలుపు వరకూవచ్చి భర్తముఖంలోని కోప చిహ్నాలు ఇంకా తగ్గకపోవటంచూసి అక్కడే ఆగిపోయింది. ‘ఏమిటో! ఈయన కోపంవస్తే మనిషికారు!’ అనుకుంటూ నిట్టూర్చింది.

“ఇంతకీ వాడు ఏంచేశాడండీ?”



అంది మెల్లగా. నిశ్చలతపస్సుకు భంగం కల్గిన మహర్షికి మల్లే కోపంగా ఆమె వంక చూశారు రాఘవయ్యగారు.

"ఏంచేశాడా? వస్తాడుగా! వాణ్ణే అడుగుదువు కాని! వేలెడంతలేడు... సెకెండుఫారం వెలగబెడుతున్నాడు! వీడు పరీక్షల్లో స్లిప్పులు రాసేడట. వార్నింగ్ ఇచ్చి డిబార్ చేయకుండా వదిలేశారట! మధ్యాహ్నం హెడ్మాస్టరు హనుమంతయ్య వచ్చి నేను కచ్చేరీలో వుండగా చెప్పేడు. అందరిముందూ ఆ మాట చెప్తావుంటే నాకు తల తీసేసినట్లయింది. ఇప్పటినుండి వీడికి ఇలాటి బుద్ధులు అలవాటయితే, ఇక వీడు పెద్ద చదువులేం చదువుతాడు? వాణ్ణి పెద్ద ఆఫీసరు చేసేద్దామని నువ్వు మహ ఉబలాటపడిపోతున్నావు...ఆశ అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగిందట!..." ఇంకా ఆయన మాటలు పూర్తికాకుండానే వీధిగేటు తెరుచుకున్న చప్పుడయింది. రాజు బెదురుతూ మెల్లగా పిల్లిలా వరండామెట్లెక్కుతున్నాడు.

"ఒరేయ్! ఇలారా!" రాఘవయ్య గారి కంఠం ఉరిమింది. రాజు తన చేతిలోని అట్ట, పేపరు స్తంభం వారగా పెట్టి మెల్లిగా తండ్రివద్దకు వెళ్లేడు.

రాఘవయ్యగారు వాలుకుర్చీలోంచి లేచినిలబడ్డారు! జరుగబోయే సన్నివేశం తల్చుకుని శాంతమ్మగారు భయంతో వణికిపోయింది.

"ఈ వేళ పరీక్షలో స్లిప్పులు రాసేవా?" రాఘవయ్యగారు గర్జించేరు.

"............"

"మాట్లాడవేం?"

ఔనన్నట్లు భయంగా తలవూపేడు రాజు.

అంతే!!

రాఘవయ్యగారి చేతికర్ర రాజు నడుంమీద పడింది!

ఒకటి... రెండు.....ఆరు...ఇంకా ఎన్నో దెబ్బలు నడుంమీదా వీపుమీదా, అందిన చోటల్లా కొట్టారు. "ఇంకెప్పుడూ రాయనండి....అమ్మో....కొట్టకండి!" అంటూ దెబ్బలు భరించలేక విలవిల్లాడుతున్నాడు రాజు. గొంతును చించుకొస్తున్న అతని ఏడుపు ఎక్కిళ్లమధ్యనే ఆగిపోతోంది. అతని కన్నులనుండి ధారావాహికంగా స్రవిస్తున్న కన్నీళ్ళు ఎర్రని చెంపలమీదనుండి జారిపోయి చొక్కాను తడిపేస్తున్నాయి.

ఇక ఈదృశ్యం చూడలేక శాంతమ్మగారు ఒక్క ఉదుటునవెళ్లి రాఘవయ్యగార్కి అడ్డుపడింది. శాంతమ్మగారి భుజంమీద ఆఖరిదెబ్బతీసి వంకీ కర్ర తన నృత్యాన్ని ఆపింది.

"అయ్యయ్యో! కుర్రాణ్ణి చంపేస్తారేమిటండి? పోయిన అయిదుగురూ రోగాలతో పోయారు. ఈ ఒక్క వెధవనీ మీరు బలవంతంగా చంపేయండి!" అంటూ ఏడుపు ప్రారంభించింది.

"వాణ్ణి ముందు నా ఎదుటి నుండి తీసుకెళ్ళు" అంటూ చేతికర్ర విసురుగా క్రిందపడేసి ముఖం తిప్పుకొని వాలుకుర్చీలో కూలబడ్డారు. రాజు నడుం చుట్టూ చెయ్యేసి మెల్లగా నడిపించుకుంటూ లోపలకు తీసుకువెళ్ళింది శాంతమ్మ.

రాఘవయ్యగారు వాలుకుర్చీలో

వెనక్కువాలి దీర్ఘంగా నిట్టూర్చేరు. చేతులు రెండూ వక్షంమీద ఆన్చుకొని మండిపోతున్న గుండెను సున్నితంగా రాసుకుంటూ బలంగా కళ్ళుమూసుకున్నారు.

'రాజుకి తెలివితేటలున్నాయి, కష్టపడి చదువుతాడు, పరీక్షలలో మంచి మార్కులే వస్తాయి. కాని ఈ దినం వాడు ఈ పనెందుకు చేశాడు? తన వ్యక్తిత్వంమీద, సామర్థ్యంమీద తనకు నమ్మకంలేకనా? లేక మిగిలిన వాళ్ళు చేస్తూవుంటే తప్పని తెలియక, తనూ చేశాడా? ఈ తరం కుర్రాళ్ళు ఎందుకిలా తయారవుతున్నారు? నిజాయితీకి, వ్యక్తిత్వానికి ఎందుకు విలువ తరిగిపోతోంది? ఈ లోపం ఎక్కడవస్తోంది? ఎవరివలన వస్తోంది? నానాటికీ క్రమశిక్షణ కోల్పోతున్న పాలకులవల్లనా? నిజాయితీ లోపిస్తున్న వ్యక్తులవల్లనా? ఈ వ్యవస్థ ఎలా మారుతుంది?...'

ఎన్నెన్నో ప్రశ్నలు!!

తుది మొదలులేని సందేహాలు!

సమాజపు వ్యవస్థ నానాటికీ దిగజారిపోతోందనేబాధ!

మహాసముద్రంలోని తిమింగలాలకుమల్లే, మనసులో ఆలోచనలు కదలాడుతున్నాయి.

వీధిలో ఏదో కలకలం వినిపించింది! పెద్దగోల! మైకులో అరుపులు! ఆలోచనలు చెదిరిపోతే, అరమోడ్పుగా కనులు విప్పిచూశారు రాఘవయ్యగారు! రోడ్డుమీద గుంపులు గుంపులుగా విద్యార్థులు! వాళ్ల చేతుల్లో పెద్దపెద్ద బోర్డులు! వాటిమీద ఎర్రని తాటికాయలంతేసిఅక్షరాలు. "విద్యార్థి నాయకులు జిందాబాద్! అక్రమం నశించాలి! డిబార్ చేసిన విద్యార్థుల్ని తిరిగి చేర్చుకోవాలి! హనుమంతయ్య డౌన్ డౌన్!" ఇంకా ఎన్నో నినాదాలు!

విద్యార్థుల ప్రవాహం ముందుకు కదుల్తోంది.

ఎలుగెత్తి అరుస్తోంది!

భావి భారతదేశాన్ని స్వర్గధామంగా దిద్ది పునీతం చేయటానికి తోడ్పడవలసిన ఈ వెల్లువ, ఈ ప్రవాహం, ఈ మహత్తరశక్తి; ఏవేవోఅర్థంలేని నినాదాలతోరోడ్డుమీద చిందులుతొక్కుతోంది.

ఎన్ని పసిగొంతులు? ఎన్ని లేత మనసులు!! ఎన్ని బంగారుమొగ్గలు!!! ఎన్నెన్ని పసిడిపాదాలు!!

పలుచని మృదువయిన చేతులు; ఏ అన్యాయానికీ, అక్రమానికి అలవాటు పడని మువ్వల్లాటిచేతులు, భరతమాత పాదాలచెంత పూజా సుమాలనుంచి భక్తితో ముకుళించవలసిన ముత్యాల్లాంటి చేతులు; రక్తవర్ణాక్షరాలతో నిండిన తడికలబోర్డులు మోస్తూ వూరంతా తిరుగుతున్నాయి.

ప్రవాహం ఇంటి ముందు నుండి దాటి ముందుకు సాగిపోయింది!

రాఘవయ్యగార్కి నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు.

కుర్రాళ్ళు స్లిప్పులు రాస్తూండగా పట్టుకొని ఉపాధ్యాయుడు దండిస్తే అది దౌర్జన్యం! మహానేరం! అందుకుగాను, ఆ దౌర్జన్యాన్ని అరికట్టేందుకుగాను సమ్మెలు! నినాదాలు! వూరేగింపులు!

ఈ వ్యవస్థ ఎలా మారుతుంది?

వ్యవస్థ మారాలంటే సమాజం మారాలి! సమాజం మారాలంటే వ్యక్తులు సంస్కరింపబడాలి. నిజాయితీని అలవరచుకోవాలి. క్లాసులోని అరవై మంది పిల్లల్ని సంస్కరించటం ఒక్క ఉపాధ్యాయునివల్లకాదు. ఇది మూకుమ్మడిగా సాధ్యమయ్యేపనికాదు: పిల్లలను సంస్కరించుకోవలసిన బాధ్యత చాలా వరకూ తల్లితండ్రులమీద వుంది. కాని ఎంతమంది తలితండ్రులు తమ బిడ్డలకు సరియైన శిక్షణ నివ్వగల్గుతున్నారు?

స్తన్యాలతో పాలను అందించేతల్లి ఆప్యాయంగా ఆదరించే తండ్రి నేర్పని శిక్షణను ఇంకెవరో పైవ్యక్తులు నేర్పటం ఎంతవరకూ సాధ్యం?

పిల్లలను స్కూలుకు పంపేసి తమ బాధ్యత తీరిపోయినట్లు నిట్టూర్పువిడిచే దృక్పథం మారనంతవరకూ ఈ వ్యవస్థ మారదు! ఏవేవో ఆలోచనలు రాఘవయ్యగారి మనసులో కదలాడేయి. బరువుగా శ్వాసపీల్చుకొని వాలుకుర్చీలోంచి లేచి మెల్లగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వచ్చారు రాఘవయ్యగారు.

వంటింటి గుమ్మం ప్రక్కగా దిగాలు పడిన ముఖంతో కూర్చుంది శాంతమ్మగారు. ఆమె కన్నుల నిండా నీళ్లు! ముఖం నిండా ఆవేదన! ఆవిడ ఒడిలో ముఖం దూర్చుకొని గువ్వపిట్టలా ఒదిగిపోయి సన్నగా రోదిస్తున్నాడు రాజు. వీపుమీద చొక్కా తొలగించి ఎర్రని దద్దుర్లమీద కొబ్బరినూనెరాసి మెల్లగా నిమురుతోంది శాంతమ్మగారు.

ఏడుపు మధ్య ఎక్కిళ్ళతో రాజు వీపు ఎగిరెగిరిపడుతోంది.

రాఘవయ్యగారి వైపు ఒకసారి మవునంగాచూసి తలదించుకుంది శాంతమ్మగారు.

ఆ దృశ్యం చూడగానే రాఘవయ్యగారి కడుపులో కలుక్కుమంది. అంత వరకూ మంచుగెడ్డలావున్న ఆయన మనస్సు ఒక్కసారి వేడితగిలి కరిగిపోయినట్లయింది. అనుకోకుండా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. చేతి కర్ర ఒక వారగాపెట్టి శాంతమ్మ దగ్గరకువచ్చి ఆమె ప్రక్కన చతికిలబడ్డారు. రాజువీపుమీద మెల్లగా వ్రాస్తూ "వెర్రి వెధవని గొడ్డును బాదినట్లు బాదేను" అన్నారు సణుక్కుంటున్నట్లు.

"పాపం! చూడండి వీపంతా ఎలా తట్లు తేలిపోయిందో?"

అంటూ శాంతమ్మగారు నోట్లో కొంగు కుక్కుకుంది.

"బాబూ!" రాజూ! మృదువుగా పిలిచేరాయన. ఆ పిలుపులో ఆయన గొంతు బొంగురుపోయింది.

రాజు తల్లిఒడిలోంచి మెల్లగాతలఎత్తి భయంగా ఆయనవైపు చూసేడు. ఏడుపు వలన అతని కళ్ళు వాచిపోయి వున్నాయి.

"ఇంకెప్పుడూ పరీక్షల్లో స్లిప్పులు రాయకేం?" అన్నారు రాఘవయ్యగారు. రాయనన్నట్టు తలవూపేడు రాజు.

"బాబూ! వ్యక్తులు నిజాయితీని కోల్పోతే సమాజం చీకటివైపు పరుగెడుతుంది. ఈ సారి పరీక్ష పోగొట్టుకుంటే మరోసారి రాసి ప్యాసవుదువుగాని! నిజాయితీని మాత్రం పోగొట్టుకోకు బాబూ!"

ఆ మాటలు అంటూంటే అయన కంఠం కంపించింది.

ఆయన చేతివేళ్ళు వణుకుతూ రాజు వీపుమీద మృదువుగా కదిలేయి. ✱